# విశేషాధికారాలు (ప్రివిలేజెస్) (రూల్ 168 నుండి 179 మరియు 256 నుండి 259)

ప్రివిలేజెస్ అనే పదానికి పార్లమెంటరీ పరిభాషలో ప్రత్యేక అర్థం ఉంది. శాసన మండళ్లు అనుభవించే ప్రత్యేక హక్కులు గనుక వీటిని విశేష హక్కులు అని కూడా పిలవటం కద్దు. శాసనసభలు, వాటి కమిటీలు వీటిని సమిష్టిగా అనుభవిస్తాయి. శాసనసభ సభ్యులు వీటిని వ్యక్తిగతంగా అనుభవిస్తారు. శాసనసభల చరిత్రలో ఈ విశేషాధికారాలకు విశిష్టత, ప్రత్యేకత ఉంది. శాసనసభలు గాని, వాటి కమిటీలుగాని, లేదా శాసనసభ్యులుగాని అతి సమర్థవంతంగాను మిక్కిలి ఫలవంతంగాను తమ విధులను నిర్వహించటానికి ప్రత్యేక హక్కులు, రక్షణలు ఉండాలి.

శాసనసభ్యుల స్వేచ్ఛను, అధికారాన్ని, హుందా తనాన్ని పరిరక్షించటమే వీటి లక్ష్యం. అదే వీటి ధ్యేయం. శాసనసభ సభ్యులు వ్యక్తిగతంగా సభా కార్యక్రమాలలో పాల్గొని చర్చలను ఫలంవంతం చేయటంద్వారా సభా కార్యకలాపాలకు సాఫల్యతను చేకూర్చుతారు. కనుక సభ తన విధులను ఎటువంటి భయభీతులు అవరోధాలు లేకుండా నిర్వహించటానికి అవసరమైనంత మేరకు విశేషాధికారాలు సభ్యులకు కల్గిస్తుంది.

## ముఖ్యమైన విశేషాధికారాలు :

రాష్ట్ర శాసనసభ సభ్యులకు శాసనసభలోను, సభా సమితులలోనూ వాక్ స్వాతంత్ర్యం ఉంది. శాసనసభా సభ్యుడు అటు



శాసనసభలోగాని ఇటు సభాకమిటీలలో గాని తాను చేసిన ప్రసంగానికి లేదా ఓటుకు సంబంధించి ఏ న్యాయస్థానంలోనూ ప్రశ్నించటానికి వీలులేదు. శాసనసభచే గాని లేదా శాసనసభా అధికారం క్రిందగాని ప్రచురించిన నివేదిక, పత్రం, ఓట్లు లేక కార్యకలాపాలకు సంబంధించి ఏ వ్యక్తి బాధ్యుడు కాడు. శాసనసభ కార్యకలాపాల విషయాల్లో విచారించుటకు న్యాయస్థానాలకు అధికారం లేదు. శాసనసభ కార్యవిధానంలో నియమ భంగం జరిగిందనే నెపం మీద రాష్ట్ర శాసనసభ కార్యకలాపాలు యేవైనా చెల్లవని ఏ న్యాయస్థానంలోనూ దావా తీసుకురావటానికి వీలులేదు. శాసనసభ కార్యవిధానాన్ని క్రమబద్ధం చేయటానికి లేదా కార్యక్రమ నిర్వహణకు లేదా సభాక్రమ పరిరక్షణకు రాజ్యాంగ చట్టంద్వారా లేక దాని క్రింద అధికారాలను పొందిన శాసనసభ అధికారులు లేక సభ్యులు ఎవరైనా కూడా తాము నిర్వహించిన ఈ అధికారాల విషయంలో న్యాస్థానాలలో ప్రశ్నించరాదు.

సభ సమావేశం జరుగుతున్నప్పుడు, సమావేశ ఆరంభానికి ముందు నలభై రోజులు, ముగింపు తర్వాత నలభై రోజుల వరకు సివిల్ కేసులకు సంబంధించి శాసనసభ్యులకు నిర్బంధం నుంచి స్వేచ్ఛ లభిస్తుంది. క్రిమినల్ కేసుల విషయంలో ఈ స్వేచ్ఛ సభ్యులకు లభించదు.

## విశేషాధికార ఉల్లంఘన :

శాసనసభ లేదా సభాకమిటీ లేదా శాసనసభ్యుని విశేషాధికారాలను (ప్రత్యేక హక్కులు, రక్షణలను) యే వ్యక్తియైనా లేదా అధికార వర్గమైనా ఉపేక్షించినగాని లేక యెదుర్కొన్నగాని సభా హక్కులకు లేక సభ్యుని



విశేషాధికారానికి భంగం కల్గినట్లవుతుంది. శాసనసభా సభ్యుడు సభ్యుడుగా తన విధులను నిర్వహించటానికి వీలు లేకుండా నిరోధించిన యెడల, విశేషాధికారాల ఉల్లంఘన జరుగుతుంది.

## సభాధిక్కారం :

సభా ఉత్తర్వుల యెడల అవిధేయతను చూపుట లేక సభయెడల, సభా సభ్యుల యెడల లేక సభాధికార్ల యెడల లిఖిత పూర్వకంగా దూషణలను చేయుటవంటి నేరాలను సభాధిక్కారాలని అంటారు. ఆ నేరాలు శిక్షారాలు. చర్యలు లేక లోపాలు లేవైనా శాసనసభ తన విధులను నిర్వహించటానికి నిరోధకంగా ఏర్పడిన గాని లేదా ఆటంకపర్చినాగానీ, లేదా శాసనసభా సభ్యులు లేక సభాధికార్లు యెవరినైనా తమ విధులను నిర్వహించుటలో ఆటంకపరచిన లేదా ఆ చర్యల వల్ల ప్రత్యక్షంగా గాని లేక పరోక్షంగా గాని ఆ విధమైన ఫలితాలను కల్పించిన గాని అట్టి చర్యలను సభాధికారం అని నిర్వచించబడడం జరిగింది. శాసనసభ సభాసమితులు, సభాసభ్యులపై దోషారోపణ చేస్తూ ప్రసంగించిన లేక వ్రాసినా ఆ చర్యలు విశేషాధికార ఉల్లంఘన లేక సభాధిక్కారం క్రిందకి వస్తాయి. సభాపతి తన విధులను నిర్వహించటంలో ఆయన ప్రవర్తన, పక్షపాత రహితత్వాన్ని దూషించటం, సభాకార్యకలాపాలను అపార్థం కల్గించేటట్లు వక్రంగా చిత్రించటం, సభా కార్యకలాపాలనుంచి తొలగించిన విషయాలను ప్రచురించటం, సభలో సభ్యుల ప్రవర్తనను పురస్కరించుకొని వారిని అవమానవర్చటం, శాసనసభాసభ్యులు తమ విధులను నిర్వహిస్తూ ఉండగా వారికి అడ్డంకులు కల్గించడం, వారు శాసనసభ లేక సభా సమితుల సమావేశాలకు హాజరుకు ఆటంకపర్చటం



మొదలైన విశేషాధికారాల ఉల్లంఘనకు కొన్ని మచ్చుతునకలు.

## సభాపతి అనుమతి :

సభ్యుడు సభాపతి అనుమతితో విశేషాధికారాల ఉల్లంఘన విషయాన్ని తీసుకు రావచ్చును.అది సభ్యుని విశేష అదికార ఉల్లంఘన అయినా కావచ్చు లేదా శాసనసభ లేక సభా సమితి విశేషాధికారాల ఉల్లంఘన అయినా కావచ్చు.

## విశేషాధికారాల నోటీసు : (రూల్ 169)

విశేషాధికారాలకు సంబంధించిన విషయాన్ని తీసుకురావలసిన సభ్యుడు లిఖితపూర్వకంగా నోటీసును కార్యదర్శికి యివ్వాలి. ఆ విషయాన్ని ఏ రోజున తీసుకురాదలచారో ఆ రోజు సమావేశం ఆరంభం అవటానికి ముందు అందుకు సంబంధించిన నోటీసును ఇవ్వాలి. ఆ విషయం ఏదేని పత్రంపై ఆధారపడి ఉంటే, ఆ పత్రాన్ని కూడా నోటీసుకు జతపర్చాలి.

## ఆమోదయోగ్యతకు నిబంధనలు :

విశేషాధికారాలకు సంబంధించిన విషయాన్ని తీసుకు రావటానికి హక్కు ఈ షరతులకు లోబడి ఉంటుంది.

(1) అదే సమావేశంలో ఒకటి కంటే ఎక్కువ విషయాలను తీసుకురాకూడదు.

(2) ఆ విషయం యిటీవల జరిగినదై ఉండాలి.

(3) అది ఒక ప్రత్యేక విషయానికి పరిమితమై ఉండాలి.

(4) ఆ విషయంలో సభాజోక్యం అవసరమై ఉండాలి.

పై నిబంధనలను ప్రాతిపదికగా తీసుకొనిగాని, ఆ విషయానికి తుల్యమైనట్టి అంశాలపై గతంలో

తీసుకున్న నిర్ణయాల ఆధారంతోను సభాపతి, విశేషాధికారాలకు సంబంధించిన విషయాలను పరిశీలిస్తారు. సభాపతి ఆ విషయాన్ని సభా సమక్షంలో తీసుకురావటానికి అనుమతించవచ్చును లేదా నిరాకరించవచ్చును. సభాపతి ఆ విషయంపై తుది నిర్ణయాన్ని తీసుకునేముందు ఏ వ్యక్తిపై నేరారోపణలు చేశారో ఆ వ్యక్తికి అవకాశాన్నిచ్చి అతని అభిప్రాయాన్ని తెలుసుకొనవచ్చును. ఆ విషయాన్ని సభా సమక్షంలో తీసుకురావటానికి సభాపతి నిరాకరిస్తు తన నిర్ణయాన్ని అందజేసిన యెడల ఆ విషయాన్ని సభలో తీసుకురావటానికి ఆ సభ్యుని అనుమతించరు.

ఆ విషయాన్ని సభా సమక్షానికి తీసుకురావటానికి సభాపతి సమ్మతినిచ్చిన యెడల, విశేషాధికారాలకు సంబంధించిన విషయాన్ని తీసుకురాదలచిన సభ్యుని సభాపతి, ప్రశ్నల అనంతరం, సభా కార్యక్రమం ప్రారంభమగుటకు పూర్వం పిలుస్తారు. ఆ సభ్యుడు తన స్థానం నుండి లేచి ఆ విషయాన్ని సభలో తీసుకొని వచ్చుటకు అనుమతిని కోరుతూ ఆ విషయాన్ని సంగ్రహంగా వివరిస్తారు. సభానుమతిని యిచ్చుటకు ఆక్షేపణ చెప్పిన యెడల, అనుకూలురైన వారు తమ తమ స్థానాలలో నిలబడాలని సభాపతి సభ్యులను కోరారు. ఇరువదియైదుకంటే యెక్కువమంది సభ్యులు ఆ విధంగా నిలబడితే సభానుమతి యివ్వడమైనదని సభాపతి ప్రకటిస్తారు. ఒకవేళ ఆ విధంగా నిలబడిన సభ్యులు ఇరువదియైదు కంటే తక్కువ యున్నయెడల, ఆవిషయాన్ని సభలో తీసుకువచ్చుటకు సభానుమతి లేదని సభాపతి ప్రకటిస్తారు. సభాపతి పిలిచినప్పుడు విశేషాధికారాలకు సంబంధించిన నోటీసును యిచ్చిన సభ్యుడు సభలో తన స్థానం నుండి లేచి



ఆ విషయాన్ని సభలో తీసుకువచ్చుటకు సభానుమతిని యివ్వవలసిందిగా కోరాలి. ఆయన బదులు ఇతరులు ఆ విషయాన్ని సభలో ప్రస్థావించుటకు వీలు లేదు.

**విశేషాధికార విషయ పరిశీలన : (రూల్ 257)**

శాసనసభ తన అనుమతిని యిచ్చిన తర్వాత సభ ఆ విషయాన్ని స్వయంగా పరిశీలించి నిర్ణయాన్ని తీసుకొనవచ్చును. లేక ఆ విషయాన్ని తీసుకువచ్చిన సభ్యుడుగాని లేక యే యితర సభ్యుడుగాని చేసిన ప్రతిపాదనపై ఆ విషయాన్ని విశేషాధికారాల సమితికి పరిశీలనార్థం పంపవచ్చు. సభాపతి విశేషాధికారాల సమితికి పంపి వాటిని పరిశీలింపవమని సమితిని కోరవచ్చును. విశేషాధికారాల విషయ పరిశీలనతో సంబంధముగా విషయాలనన్నింటి లోను కార్య విధానాన్ని క్రమబద్ధం చేయుటకు సభాపతి అవసరమని భావించిన ఆదేశాలను యివ్వవచ్చును.

**విశేషాధికారాల సమితి ఏర్పాటు : (రూల్ 256)**

సభాపతి, విశేషాధికారాల సమితిని ఏర్పాటు చేస్తారు. దానిలో ఏడు (7) మందికి మించని సభ్యులు ఉంటారు.

**మంత్రి సభ్యుడుగా ఉండకూడదు :**

కమిటీ సభ్యునిగా మంత్రిని నామనిర్దేశం చేయకూడదు. కమిటీకి నామనిర్దేశం చేయబడిన సభ్యుడు మంత్రిగా నియమింపబడినట్లయితే, అట్టి నియామకపు తేదీ నుండి ఆ సభ్యుడు కమిటీ సభ్యత్వమును కోల్పోవును. పరిశీలన: విశేషాధికారాల సమితి తనకు పంపిన అన్ని విషయాలను పరిశీలించి ఆయా విషయాలలో ప్రతి అంశానికి సంబంధించి అందు విశేషాధికారాల ఉల్లంఘన జరిగిందా



లేదా అనియు, జరిగినచో ఉల్లంఘన స్వభావాన్ని అందుకు దారి తీసిన పరిస్థితులను నిర్ణయించి సమితి సిఫారసులను పని చేస్తుంది. సమితి చేసిన సిఫారసులను అమలు జరుపుటలో సభ అనుసరించ వలసిన కార్యవిధానాన్ని కూడా నివేదికలో పేర్కొనవచ్చును.

**నివేదిక సమర్పణ : (రూల్ 258)**

సమితి అధ్యక్షులుగాని లేదా వారి తరపున సమితి సభ్యులు యెవరైనా విశేషాధికారాల సమితి నివేదికను సభకు సమర్పిస్తారు. నివేదిక పరిశీలన : నివేదికను సభకు సమర్పించిన పిమ్మట, సమితి అధ్యక్షుడు లేక సమితి సభ్యులు యెవరైనా లేక యెవరేని యితర సభ్యుడు ఆ నివేదికను పరిశీలనలోనికి తీసుకొనవలసిందిగా ప్రతిపాదిస్తారు. సభాపతి ఆ విషయాన్ని సభానుమతికి పెట్టి సభాభిప్రాయాన్ని ప్రకటిస్తారు.

ఆ తర్వాత సమితి అధ్యక్షుడు లేక సమితి సభ్యుడు లేక యే యితర సభ్యుడు అయినా నివేదికలో పొందుపరచిన సిఫారసులతో సభ అంగీకరించినది లేనిది లేక సవరణలతో అంగీకరించినది అని ప్రతిపాదించవచ్చును. సాధారణంగా విశేషాధికార ఉల్లంఘనకు సంబంధించిన కేసులలో విషయాంశం చాలా స్వల్పము. నేరస్థుడు క్షమాపణను కోరడం జరుగుచుండుటచే సభ ఆ విషయాలలో మరి ఎట్టి చర్యతీసుకొనకుండా ఆ విషయాలను అంతటితో వదిలివేయటం జరుగుతోంది.



**12**

## ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్య విధానం సంపుటి

## విశేషాధికారాలు (ప్రివిలేజస్)




ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
సచివాలయం, వెలగపూడి, అమరావతి.